జాతీయ క్రికెట్ అకాడమీకి కావ్యశ్రీ

జాతీయ క్రికెట్ అకాడమీ శిక్షణకు ఎంపికైన కావ్యశ్రీ

పీర్జాదిగూడ, మార్చి 21: జాతీయ క్రికెట్ అకాడమీ శిక్షణకు మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి పర్వతాపూర్, సాయి ఐశ్వర్య కాలనీకి చెందిన గుగులోతు కావ్యశ్రీ ఎంపికైంది. చిన్న నాటి నుంచి క్రికెట్‌పై మక్కువగా ఉన్న కావ్యశ్రీ పలు టోర్నీలలో పాల్గొంది. అండర్-15 బాలికల హైదరాబాద్ క్రికెట్ జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించడంతో పాటు అండర్-16 జట్టులోనూ ఆటతీరును మెరుగు పరుచుకుంటూ మహిళా జట్టులోని అరుదైన అవకాశాన్ని వక్కించుకుంది. కావ్యశ్రీ స్థానికంగా ఉన్న ఒమేగ కళాశాలలో ఇంటర్ మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుకుటుంది. క్రికెట్‌లో అద్భుత ప్రతిభను కనబరుస్తూ బీసీసీఐకి చెందిన భారత జాతీయ క్రికెట్ అకాడమీలో శిక్షణకు ఎంపిక కావడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వివిధ కోర్సుల పరీక్షా ఫలితాల విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ, మార్చి 21: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని వివిధ కోర్సుల పరీక్షా ఫలితాలను విడుదల చేసినట్లు ఓయూ పరీక్షల విభాగం, కంట్రోలర్ ప్రొఫెసర్ రాములు తెలిపారు. హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సులైన బీహెచ్ఎంసీటీ, బీసీటీసీఏ కోర్సుల సెమిస్టర్ రివాల్యుయేషన్ ఫలితాలతో పాటు బీసీఏ మొదటి, రెండు, మూడు, నాలుగు, ఐదో సెమిస్టర్ పరీక్షా ఫలితాలను విడుదల చేసినట్లు చెప్పారు.

ఎం.ఫార్మసీ ఫలితాల రివాల్యుయేషన్..

ఓయూ పరిధిలోని ఎం.ఫార్మసీ పరీక్షా ఫలితాల రివాల్యుయేషన్‌కు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. ఎం.ఫార్మసీ (పీసీఐ) రెండో సెమిస్టర్ మెయిన్, మొదటి, రెండు, మూడో సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షా ఫలితాలను ఇప్పటికే విడుదల చేశామన్నారు. విద్యార్థులు తమ మార్కు మెమోలను మూడు వారాల తరువాత నుంచి సంబంధిత కళాశాలల్లో తీసుకోవాలని సూచించారు. ఈ ఫలితాలపై రివాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకోవాలనుకుంటే ఒక్కో పేపర్‌కు రూ.800 చొప్పున చెల్లించి, ఈ నెల 28వ తేదీలోగా టీఎస్ ఆన్‌లైన్ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. రూ.200 అపరాధ రుసుముతో 30వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. జవాబు పత్రాల నకలు పొందగోరువారు ఒక్కో పేపర్‌కు రూ.1000 చొప్పున చెల్లించి ఈ నెల 28వ తేదీలోగా తమ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని పేర్కొన్నారు.

మోదీ కనుసన్నల్లో.. కేంద్ర దర్యాప్తు సంస్థలు

నాడు కాంగ్రెస్‌కు... నేడు బీజేపీకి....

- ఈడీ కేసులో అసలు క్లారిటీయే లేదు....
- మోదీకి తలొగ్గనందుకే మాజీ సీఎం కేసీఆర్‌పై రివెంజ్‌లా..!?
- యునైటెడ్ పూలే ఫ్రంట్ సమావేశంలో వక్తలు

ఖైరతాబాద్, మార్చి 21 : కేంద్ర ప్రభుత్వ దర్యాప్తు సంస్థలు ఎప్పుడు వారికి జేబు సంస్థల్లా పనిచేస్తూ వస్తున్నాయని, నాడు కాంగ్రెస్, నేడు బీజేపీ చెప్పినట్లు చేస్తున్నాయని యునైటెడ్ పూలే ఫ్రంట్ సమావేశంలో వక్తలు ఆరోపించారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో యునైటెడ్ పూలే ఫ్రంట్ కన్వీనర్ గట్టు రాంచందర్ మాట్లాడుతూ, యునైటెడ్ పూలే ఫ్రంట్ నిర్మాణంతో పాటు బీసీలందరినీ ఏకతాటిపైకి తీసువచ్చి వారి సంక్షేమానికి పాటుపడుతున్న ఎమ్మెల్సీ కవితను ఈడీ అక్రమంగా అరెస్టు చేసిందన్నారు. ఇందులో రాజకీయ ప్రయోజనాలు తప్ప ఏమీ కనబడటం లేదన్నారు. ఒక మహిళ, మాజీ ముఖ్యమంత్రి కుతూరు, ఎంపీ, ఎమ్మెల్సీగా ఉన్న కవితను రూల్‌ను అతిక్రమించి అరెస్టు చేశారన్నారు. అది కేవలం కేసీఆర్‌ను మానసికంగా ఇబ్బంది పెట్టాలని, రాజకీయ లబ్ధి పొందాలని బీజేపీ చేసిన ఘన కార్యమన్నారు. బీజేపీ ప్రజా సమస్యలు పట్టించుకోదని, సామాజిక ఉపరితలం రాజకీయాలు చేస్తూ, ఎన్నికలు వచ్చినప్పుడల్లా సామాజికవర్గాల మధ్య ఘర్షణ పెట్టి బతికే పార్టీ బీజేపీ అని విమర్శించారు. ఎవరైనా ఎదురుతిరిగినా, ప్రశ్నించే గొంతుకలున్నా ఈడీ వస్తారు..! ఆ తర్వాత మోదీ వస్తారని ఎద్దేవా చేశారు. కవిత అరెస్టు సమయంలో మోదీ, ఈడీ కలిసి వచ్చారని, అరెస్టు చేయాలన్న అవగాహనతోనే వచ్చారన్నారు. బలవంతంగా నేరం అంటగట్టాలన్న ప్లాన్‌తో వచ్చారని, విమానం టికెట్‌లు కూడా బుక్ చేసుకొని వచ్చారంటే అర్థమవుతుందన్నారు. యూపీఎఫ్ కో కన్వీనర్ తాడూరి శ్రీనివాస్ మాట్లాడుతూ, కాంగ్రెస్, బీజేపీ కుమ్మక్కు రాజకీయాలపై ఇప్పటికే దేశంలో చర్చ జరుగుతుందన్నారు. సమావేశంలో యునైటెడ్ పూలే ఫ్రంట్ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షులు ఎల్చల దత్తాత్రేయ, కో కన్వీనర్లు నాగేందర్, ముప్పు బిక్షపతి, డి.నరేశ్, ఆలకుంట్ల హరి, మహిళా అధ్యక్షురాలు గీత తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో నినాదాలు చేస్తున్న రాంచందర్, శ్రీనివాస్, ముప్పు బిక్షపతి, దత్తాత్రేయ తదితరులు

స్టోన్ క్రషర్స్ సమ్మె విరమణ

సమస్యల పరిష్కానికి మంత్రి 'కోమటిరెడ్డి' హామీ

బంజారాహిల్స్, మార్చి 21: తీవ్రమైన సంక్షోభంలో ఉన్న స్టోన్ క్రషర్స్ సమస్యలను పరిష్కరించాలని చేపట్టిన సమ్మెను విరమించారు. మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి హామీ మేరకు విరమిస్తున్నట్లు క్రషర్ ఓనర్స్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ అధ్యక్షుడు కరుణాకర్ రెడ్డి తెలిపారు. బంజారాహిల్స్ రోడ్ నం.2 లోని జింఖాన క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అసోసియేషన్ ఉపాధ్యక్షుడు బుడ్డి నందారెడ్డి, ప్రధాన కార్యదర్శి కూన శ్రీనివాస్ గౌడ్‌తో పాటు రాష్ట్ర వ్యాప్తంగా పలు ప్రాంతాల నుంచి వచ్చిన క్రషర్స్ నిర్వాహకులతో కలిసి అధ్యక్షుడు కరుణాకరెడ్డి మాట్లాడారు. స్టోన్ క్రషింగ్ ద్వారా రూ.1600 కోట్లు ప్రభుత్వానికి ప్రతియేటా రాయల్టీగా చెల్లిస్తున్న తమపై అధికారుల వేధింపులు తీవ్రంగా ఉన్నాయన్నారు. ఫిట్ మెజర్‌మెంట్ ఆధారంగా కొలతలు తీసుకొని 1996 నుంచి రాయల్టీ చెల్లించాలని చెప్పడం దారుణమన్నారు. సుమారు 20 వేల మందికి ప్రత్యక్షంగా, వేలాదిమందికి పరోక్షంగా ఉపాధి కల్పిస్తున్న స్టోన్ క్రషర్స్ రంగాన్ని పరిశ్రమగా గుర్తించాలని, సరైన విధానాలను రూపొందించి ఆదుకోవాలని కోరారు. ఓటర్ రింగ్ రోడ్ చుట్టూ అక్రమంగా క్రషర్స్ నడుస్తున్నాయని, వాటిని మూసేయాలని, పర్యావరణ అనుమతులను త్వరితగతిన ఇవ్వడం కోసం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు 16వ తేదీ నుంచి చేపట్టిన సమ్మెలో సుమారు 600 పైగా క్రషర్స్ మూతపడ్డాయని తెలిపారు. కాగా తమ సమ్మెను గురించి తెలుసుకున్న మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి గురువారం తమ అసోసియేషన్‌తో చర్చలు జరిపారన్నారు. ఎన్నికల కోడ్ కారణంగా నిర్ణయాలు తీసుకోలేమని, ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే మంత్రుల సబ్ కమిటీ ఏర్పాటు చేయించి సమస్యలు పరిష్కరించేలా చూస్తామని హామీ ఇచ్చారని, మంత్రి హామీతో సమ్మెను విరమిస్తున్నామని ప్రకటించారు. ఈ సమావేశంలో అసోసియేషన్ సభ్యులు మోహన్‌రెడ్డి, చైతన్య, ప్రభాకర్‌రెడ్డి, కౌశిక్‌రెడ్డి, వీరారెడ్డి, రాంరెడ్డి పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న క్రషర్ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కరుణాకర్‌రెడ్డి

ఆధునిక లిథియం బ్యాటరీల ఆవిష్కరణ

సిటీబ్యూరో, మార్చి 21(నమస్తే తెలంగాణ): హైదరాబాద్‌లోని టాటా ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసెర్చ్ పరిశోధకులు అధిక నాణ్యత, మన్నికమైన, తక్కువ నిర్వాహణ ఖర్చులతో కూడిన లిథియమ్ మెటల్ బ్యాటరీలను అభివృద్ధి చేశారు. ఎలక్ట్రిక్ వెహికిల్స్ వినియోగం పెరుగుతున్న క్రమంలో ప్రస్తుతం ఉన్న లిథియం అయాన్ బ్యాటరీల కంటే 10 రెట్లు అధిక శక్తినిచ్చే లిథియం మెటల్ బ్యాటరీలను డెవలప్ చేశారు. ప్రస్తుతం ఉన్న లిథియం అయాన్ బ్యాటరీల కంటే ఎంతో మన్నికగా ఉంటాయని, విద్యుత్ ఘాతానికి నిలువరిస్తాయని చెబుతున్నారు. ప్రీతి యాదవ్, పల్లవి ఠాకూర్ టీఐఎఫ్ఆర్ బృందం గ్రాఫైట్ పౌడర్‌ను వినియోగించి షార్ట్ సర్క్యూట్‌కు ఆస్కారం లేకుండా ఉండే విధానాన్ని డెవలప్ చేశారు. పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా నూతన విధానంలో ఆధునిక లిథియం బ్యాటరీలను డెవలప్ చేస్తామన్నారు.

జంతు వ్యాధుల అధ్యయానికి ఏకీకృత విధానం

డీబీటీ - ఎన్ఐఏబీ వేదిక పలు పరిశోధన సంస్థలతో కన్సార్టియం ఏర్పాటు

సిటీబ్యూరో, మార్చి 21(నమస్తే తెలంగాణ): జంతు సంబంధిత వ్యాధుల అధ్యయనానికి జాతీయ స్థాయిలో ఏకీకృత విధానాన్ని డిపార్ట్‌మెంట్ ఆఫ్ బయోటెక్నాలజీ ఆధ్వర్యంలో - గచ్చిబౌలిలోని గౌలిదొడ్డి నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ యానిమల్ బయోటెక్నాలజీ (ఎన్ఐఏబీ) వేదికగా కన్సార్టియం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సదస్సులో బ్యాక్టీరియా, వైరల్, ప్రోటోజోవా, ఆహార కల్తీ ఆధారంగా పశువులు, పందులకు సంక్రమించే వ్యాధుల గుర్తింపు, నియంత్రణ, చికిత్స విధానాలతో పాటు ఏకీకృత పశువైద్య విధానాలను రూపొందించడమే లక్ష్యంగా కృషి చేయనున్నారు. అదే విధంగా పొంచి ఉన్న పశు సంబంధిత వ్యాధులను ముందుగానే గుర్తించడానికి ఈ కన్సార్టియం వేదికగా జరగనుంది. రెండ్రోజుల పాటు నిర్వహించిన సమావేశంలో నార్త్ ఈస్ట్ రాష్ట్రాలతో పాటు, అన్ని రాష్ట్రాల పరిశోధకులు హాజరయ్యారు.

కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి

యంగ్ డిప్లమాటిక్ క్లబ్ ప్రారంభం

మేడ్చల్, మార్చి 21: గుండ్ల పోచంపల్లి మున్సిపాలిటీ మైసమ్మగూడలోని మల్లారెడ్డి మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన యంగ్ డిప్లమాటిక్ క్లబ్‌ను ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి డిప్లమాటిక్ క్లబ్ సౌత్ సదన్ గౌరవ చైర్మన్‌తో గురువారం కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, యువత శక్తి అపారమైనదని, దాన్ని సరియైన మార్గంలో వినియోగిస్తే సమాజంలో పెనుమార్పులు తీసుకురావచ్చన్నారు. విద్యార్థి దశలోనే నాయకత్వ లక్షణాలను పెంపొందించుకొని, సమాజ హితం కోసం పాటుపడాలన్నారు. కార్యక్రమంలో మల్లారెడ్డి వర్సిటీ వీసీ వీఎస్‌కే రెడ్డి, ప్రెసిడెంట్ భద్రా రెడ్డి, కార్యదర్శి మహేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీవోఎం ఆధ్వర్యంలో ఆలిండియా హిందీ సెమినార్

సిటీబ్యూరో, మార్చి 21(నమస్తే తెలంగాణ): బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర ఆధ్వర్యంలో ఆలిండియా హిందీ సెమినార్ నిర్వహించారు. ఢిల్లీ కేంద్రంగా ఏర్పాటు చేసిన ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా అధికార భాషా సెక్రటరీ ఆన్షులీ ఆర్యతో పాటు, బీవోఎం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆశీష్ పాండే, జీఎంలూ చిత్ర దతార్, రాజేష్ కుమార్, జోనల్ మేనేజర్లు హరి శంకర్, డీజీఎం రాజేంద్ర శ్రీవాస్తవ, డైరెక్టర్ జగ్జీత్ కుమార్, డిప్యూటీ డైరెక్టర్ ధర్మబీర్‌తో పాటు బ్యాంకింగ్ నిపుణులు, కేంద్ర హోం శాఖ ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా అధికార భాషా సెక్రటరీ అన్షులీ ఆర్యా మాట్లాడుతూ, దేశ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడంలో బ్యాంకింగ్ సంస్థలు వెన్నుముకలా పనిచేస్తున్నాయన్నారు. ఆమె మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలు బ్యాంకింగ్ సేవలను విస్తరించడంలో హిందీ భాషా ముఖ్య భూమికను పోషిస్తుందన్నారు. హిందీ భాషాభివృద్ధికి బీవోఎం తీసుకున్న సేవలను అభినందించారు.

టీఎస్ఆర్టీసీ లైసెన్స్ పోర్టర్స్‌ను ప్రభుత్వోద్యోగులుగా గుర్తించాలి

సీపీఐ జాతీయ కార్యదర్శి, మాజీ ఎంపీ అజీజ్ పాషా

సమావేశంలో మాట్లాడుతున్న మాజీ రాజ్యసభ సభ్యుడు అజీజ్ పాషా

సుల్తాన్ బజార్, మార్చి 21: ఆర్టీసీ బస్టాండ్‌లలో విధులు నిర్వహిస్తున్న హమాలీలను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గుర్తించి నాల్గో తరగతి ప్రభుత్వ ఉద్యోగులుగా నియమించాలని సీపీఐ జాతీయ కార్యదర్శి, మాజీ రాజ్యసభ సభ్యుడు అజీజ్ పాషా డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఎంజీబీఎస్‌లో ఏఐటీయూసీ అనుబంధ సంస్థ టీఎస్ ఆర్టీసీ లైసెన్స్ పోర్టర్స్ యూనియన్ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ, అనేక సంవత్సరాలుగా ఎంజీబీఎస్ ఆర్టీసీ బస్టాండ్‌తో పాటు ఇతర బస్టాండ్లలో ప్రయాణికుల సామగ్రిని బస్సులలో చేరుస్తూ నిత్యం ఆర్టీసీకి, ప్రజలకు సేవ చేస్తున్న హమాలీలకు పీఎఫ్, ఈఎస్ఐ వంటి సౌకర్యాలు లేకుండా శ్రమ దోపిడీకి గురవుతున్నారన్నారు. హమాలీలకు ఆర్టీసీ ఆసుపత్రిలో వైద్యం చేయించుకునేందుకు తెలంగాణ ప్రభుత్వం అనుమతి ఇవ్వాలని కోరారు. రైల్వే రంగంలో ఉన్నటువంటి పోర్టర్స్‌కు ఇస్తున్నటువంటి సౌకర్యాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీ పోర్టర్స్‌కు కల్పించి, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని ఆయన డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ రాష్ట్ర ఉపప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ మాట్లాడుతూ ఆర్టీసీ బస్టాండ్‌లలో పని చేస్తున్న పోర్టర్స్‌కు ప్రతి రెండేండ్లకోసారి వేతన పెంపు జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. రెస్ట్ రూమ్‌లు, యూనిఫామ్ ఇతర సౌకర్యాలు ఆర్టీసీ యాజమాన్యం అందించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ హైదరాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి కమతం యాదగిరి, వర్కింగ్ ప్రెసిడెంట్ పి వెంకటయ్య, డిప్యూటీ జనరల్ సెక్రటరీ బొడ్డు పల్లి కిషన్, యూనియన్ వైస్ ప్రెసిడెంట్ జి.దాసు, ప్రధాన కార్యదర్శి ఎండీ కాశీం, సంయుక్త కార్యదర్శి కె.కొండయ్య, కోశాధికారి డి.శ్రీను, ఏఐటీయూసీ నగర నాయకులు శ్రీనివాస్ పాల్గొన్నారు.

భాగ్యనగర్ అయ్యప్పస్వామి అసోసియేషన్ చైర్మన్

జమాల్‌పూర్ మహేశ్ భాయ్ కన్నుమూత

సిటీబ్యూరో, మార్చి 21(నమస్తే తెలంగాణ): భాగ్యనగర్ అయ్యప్పస్వామి అసోసియేషన్ చైర్మన్, ప్రముఖ వ్యాపారి జమాల్‌పూర్ మహేశ్ భాయ్ గురువారం మధ్యాహ్నం కన్నుమూశారు. కొద్ది రోజులుగా ఆయన అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. జియాగూడ కబేళాలో మోండెదార్‌గా, వ్యాపారిగా మంచి పేరుతెచ్చుకున్న మహేశ్ అయ్యప్ప స్వామి పరమ భక్తుడు. ఈ క్రమంలో భాగ్యనగర్ అయ్యప్ప స్వామి అసోసియేషన్‌ను స్థాపించి, హైదరాబాద్ నగరంలోనే తొలిసారిగా శబరిమల తరహాలో అయ్యప్పస్వామిని అంబారిపై ఊరేగించి మహేశ్ గురుస్వామిగా పేరు తెచ్చుకున్నాడు. మహేశ్ స్వామి మరణ వార్తతో జియాగూడలోని ఆయన నివాసం వద్ద విషాద ఛాయలు అలముకున్నాయి. ఈ సందర్భంగా పెట్రోల్ రాజు గురుస్వామి, సీనియర్ పాత్రికేయులు బండారి మహేశ్వర్ రావు, శ్రీనివాస్ జీ, తదితరులు వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలుపుతూ, సంతాపాన్ని ప్రకటించారు.

సికింద్రాబాద్ జిల్లా ఏర్పాటు ప్రతిపాదన సరైనదే

హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ



హర్యానా గవర్నర్ దత్తాత్రేయకు వినతిపత్రం ఇస్తున్న లష్కర్ జిల్లా సాధన సమితి నేతలు

సికింద్రాబాద్, మార్చి 21: సికింద్రాబాద్ జిల్లా ఏర్పాటు చేయాలనే ప్రతిపాదన సరైనదేనని హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ పేర్కొన్నారు. సికింద్రాబాద్ జిల్లాను ఏర్పాటు చేయాలని చేపట్టిన తమ ఉద్యమానికి మద్దతు తెలపాలని జిల్లా సాధన సమితి అధ్యక్షులు గుర్రం పవన్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో గురువారం రాంనగర్‌లోని ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ, ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు, 40 జీహెచ్ఎంసీ మున్సిపల్ డివిజన్లతో కూడి ఎంతో చరిత్ర కలిగిన సికింద్రాబాద్ జిల్లాగా ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. గవర్నర్‌ను కలిసిన వారిలో సమితి ప్రధాన కార్యదర్శి సాదం బాలరాజు యాదవ్, ఉపాధ్యక్షులు శైలేందర్, సభ్యులు అశోక్, కృష్ణ సాగర్ ముదిరాజ్, సునీల్, జగదీశ్, జగ్గయ్య తదితరులు ఉన్నారు.

జర్నలిస్టులకు తప్పకుండా ఇండ్ల స్థలాలిస్తాం

దక్కన్ జర్నలిస్ట్ హౌసింగ్ సొసైటీకి మంత్రి పొంగులేటి హామీ

సిటీబ్యూరో, మార్చి 20(నమస్తే తెలంగాణ): హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న జర్నలిస్టులకు తప్పకుండా ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు ప్రభుత్వం నిబద్ధతతో ఉందని రాష్ట్ర రెవెన్యూ గృహ నిర్మాణం, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. బంజారాహిల్స్‌లో గురువారం మంత్రి ఇంట్లో దక్కన్ జర్నలిస్ట్ హౌసింగ్ సొసైటీ (డీజీహెచ్ఎఫ్) ప్రతినిధులు కలిశారు. ఈ సందర్భంగా డీజేహెచ్ఎస్ వెబ్‌సైట్‌ను మంత్రి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డీజీహెచ్ఎస్ అధ్యక్షుడు బొల్లోజు రవి, ఉపాధ్యక్షులు మరిపాల శ్రీనివాస్, కోశాధికారి చిలుకూరి అయ్యప్ప, డైరెక్టర్లు గంగాపురం ప్రతాప్ రెడ్డి, కొత్తకాపు విక్రమ్ రెడ్డి, సభ్యులు శ్రావణి, సురేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

గౌడ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయండి

మంత్రి పొన్నంను కలిసిన బీసీ విద్యార్థి సంఘం

సిటీబ్యూరో, మార్చి 21(నమస్తే తెలంగాణ): గౌడ కార్పొరేషన్‌తో పాటు వివిధ బీసీ కులాల కార్పొరేషన్లను ఏర్పాటు చేయాలని బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను గురువారం బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బొల్లేపల్లి స్వామి గౌడ్ కోరారు. ఈ కార్యక్రమంలో పుట్ట పవన్, రాజశేఖర్, బద్రి, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

అలుపెరగని కృషితోనే దేశాభివృద్ధి

మెట్రో రైల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి

సిటీబ్యూరో, మార్చి 21(నమస్తే తెలంగాణ): ఆలుపెరగని కృషితోనే దేశం అభివృద్ధి చెందుతుందని, ట్రిలియన్ డాలర్ ఎకానమీ సాధించేందుకు ప్రతి ఒక్కరు పని చేయాలని హైదరాబాద్ మెట్రో రైల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి అన్నారు. ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీలో వార్షిక స్టూడెంట్ ఫెస్టివల్‌ను గురువారం ఏర్పాటు చేశారు. ఇందుకు ముఖ్య అతిథిగా హాజరైన ఎన్వీఎస్ రెడ్డి, అసోసియేట్ డైరెక్టర్ ప్రొ.అజయ్ ధార్ తదితరులు పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఎన్వీఎస్ రెడ్డి మాట్లాడుతూ, మెట్రో నిర్మాణంలో ఎన్నో సవాళ్లను ఎదుర్కొన్నామని, కానీ, మహానగరంలో మెరుగైన రవాణా సదుపాయాలను కల్పించాలనే లక్ష్యంతో సమష్టిగా పనిచేసి ప్రపంచంలోనే తొలి పీపీపీ విధానంలో అతి పెద్ద మెట్రో రైల్ ప్రాజెక్టును నిర్మించినట్లుగా తెలిపారు. భావితరాలు అంకుఠిత దీక్షతో పనిచేస్తూ దేశాభివృద్ధికి పాటుపడాలన్నారు. శాస్త్రీయ సాంకేతిక రంగంలో వినూత్న పరిశోధనలతో ఐఐసీటీ ముఖ్య భూమికను పోషిస్తుందని ప్రొ. దార్ కొనియాడారు. ఇలాంటి కార్యక్రమాలతో విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంపొందించేలా సంయుక్త్ కార్యక్రమం సాయపడుతుందని డా.మంజునాథ్ వ్యాఖ్యానించారు. కార్యక్రమంలో ఐఐసీటీ డైరెక్టర్ డా. డీ శ్రీనివాస్ రెడ్డి, విద్యార్థులు, పరిశోధకులు పాల్గొన్నారు.



ఐఐసీటీ వార్షిక ఫెస్టివల్‌లో ఎన్వీయెస్ రెడ్డితో పాటు పాల్గొన్న పలువురు ప్రముఖులు

కళా ప్రక్రియలను పరిరక్షించుకోవాలి

జుడీషియల్ అకాడమీ డైరెక్టర్ డాక్టర్ మంగారి రాజేందర్

తెలుగు యూనివర్సిటీ, మార్చి 21: సంగీతం, సాహిత్యం, కళా ప్రక్రియలు మానవ జీవితానికి ముడిపడి ఉండే ప్రక్రియలని, వాటిని పరిరక్షించుకోవాలని తెలంగాణ రాష్ట్ర జుడీషియల్ అకాడమీ డైరెక్టర్ డాక్టర్ మంగారి రాజేందర్ (జింబో) అన్నారు. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం విస్తరణ సేవా విభాగం ఆధ్వర్యంలో 2022వ సంవత్సరానికి గాను వివిధ రంగాలలో విశేషమైన కృషి చేసిన ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన 23 మంది ప్రముఖులకు కీర్తి పురస్కారాలను వర్సిటీ ఆడిటోరియంలో గురువారం జరిగిన కార్యక్రమంలో ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంగారి రాజేందర్ ప్రసంగిస్తూ, కళా ప్రక్రియలను పరిరక్షించుకునే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఆయన అన్నారు. తెలుగు వర్సిటీ వీసీ ఆచార్య టి.కిషన్‌రావు ప్రసంగిస్తూ, పురస్కార గ్రహీతల కృషిని తన ప్రసంగంలో కొనియాడారు. రిజిస్ట్రార్ ఆచార్య భట్టు రమేష్, విస్తరణ సేవా విభాగం ఇన్‌చార్జి రింగు రామ్మూర్తి ప్రసంగించారు. జానపద కళల శాఖ అధిపతి డాక్టర్ లింగయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన డప్పు వాయిద్య ప్రదర్శనను వీక్షించిన ఆహూతులను అభినందించారు.

దశాబ్దాలుగా మీడియా రంగానికి సేవలందిస్తున్నందుకుగాను డాక్టర్ జి.అమృలత కీర్తి పురస్కారాన్ని నమస్తే తెలంగాణ పత్రిక కార్టూనిస్టు మృత్యుంజయకు ప్రదానం చేస్తున్న జుడీషియల్ అకాడమీ డైరెక్టర్ డాక్టర్ మంగారి రాజేందర్, తెలుగు వర్సిటీ వీసీ ఆచార్య టి.కిషన్‌రావు, రిజిస్ట్రార్ ఆచార్య భట్టు రమేశ్

తెలుగు వర్సిటీ కీర్తి పురస్కారాలను ఆచార్య బూదాటి వెంకటేశ్వర్లు(సాహిత్య విమర్శ), కొల్లాపురం విమల(మహిళాభ్యుదయం), కొడాలి వెంకటేశ్వరరావు (లలిత సంగీతం), ప్రసన్న కుమారి (శాస్త్రీయ సంగీతబం), ఎస్.కె.బాబూజీ (జానపద కళలు), రంగరాజు పద్మజ (ఉత్తమ రయయిత్రి), నామని సుజాతాదేవి (ఉత్తమ రచయిత్రి), డాక్టర్ కె.శ్రీదేవి (నవల), లలితారాజ్ (ఉత్తమ నటి), మోహన్ సేనాపతి (ఉత్తమ నటుడు), గరికపాటి కాళిదాస్ (నాటక రంగంలో కృషి) డాక్టర్ ఆర్.ఎల్.వి.రమేష్(ఆంధ్ర నాట్యం), డాక్టర్ ఎస్పీ భారతి (కూచిపూడి నృత్యం), జి.వి.ఎన్.రాజు (వ్యక్తిత్వ వికాసం), షరీఫ్ గోరా (హేతువాద ప్రచారం కృషి), డాక్టర్ చేగోని రవి కుమార్ (గ్రంథాలయ సమాచార విజ్ఞానం), అనుముల శ్రీనివాస్ (గ్రంథాలయకర్త), మాడిశెట్టి గోపాల్ (సాంస్కృతిక సంస్థ నిర్వహణ), బీవీ సత్యనగేష్ (ఇంద్రజాలం), మృత్యుంజయ (కార్టూనిస్ట్), డాక్టర్ నూనె వెంకటయ్య (జ్యోతిషం), సి. రామనాథ శర్మ (ఉత్తమ ప్రధానోపాధ్యాయులు), గౌరి వేముల(చిత్రలేఖనం) విభాగాలకు గాను అందుకున్నారు. ఒక్కొక్కరికి రూ.5,116ల నగదు, శాలువాతో ఘనంగా సత్కరించారు.